క్లుప్తంగా

యువరాజారెడ్డికి పురస్కారం



జి.మామిడాడలో యువరాజారెడ్డిని సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

పెదపూడి: జి.మామిడాడకు చెందిన లయన్స్ క్లబ్ కార్యదర్శి, వ్యాయామ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డికి రాష్ట్ర స్థాయిలో 316 మల్టిపుల్ లయన్స్ క్లబ్‌ల ఉత్తమ కార్యదర్శిగా అవార్డు లభించింది. ఈ మేరకు సోమవారం జి.మామిడాడలో ఆయన వివరాలు వెల్లడించారు. యువరాజారెడ్డిని క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి, సీనియర్ సభ్యులు రాజారెడ్డి, ఆర్ఏఆర్‌కే చౌదరి తదితరులు శాలువా కప్పి సత్కరించారు. ఆయనకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు.

1న రైతు భరోసా విడుదల

మధురపూడి: జిల్లాలోని రైతన్నలకు రైతు భరోసా విడుదల కార్యక్రమం కోరుకొండలో జూన్ ఒకటిన జరుగుతుందని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సత్రాజు తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. రైతులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 30వ తేదీన జిల్లాస్థాయిలో నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని కొన్ని కారణాల వల్ల వాయిదా వేశారన్నారు.

హెల్పర్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

పెదపూడి: స్థానిక రజకపేటలోని కోడ్ నంబర్ 99 అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టుకు దరఖాస్తులు కోరుతున్నామని సామర్లకోట ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మావతి తెలిపారు. దీనికిగాను సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, జూన్ 9వ తేదీలోగా అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పశువులకు బీమా చేయించాలి

సీతానగరం: రైతులు తమ పశువులకు బీమా చేయించాలని చినకొండేపూడి పశువుల ఆసుపత్రి డాక్టర్ ఎ.ఫణీంద్ర సూచించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలు తమ పశువులకు రూ.30 వేల పథకానికి రూ.384, రూ.15 వేల బీమాకు రూ.182 చెల్లించాలన్నారు. జనరల్ కేటగిరిలో రూ.30 వేల బీమాకు రూ.960, అలాగే రూ.15 వేల బీమాకు రూ.480 చెల్లించాలన్నారు. మేకలు, గొర్రెలకు బీమా రూ.6 వేలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీలు ఏడాదికి రూ.36, రెండేళ్లకు రూ. 54, మూడేళ్ల వరకు బీమా వర్తించాలంటే రూ. 75 కట్టాలన్నారు. జనరల్ కేటగిరిలో రూ.90, రూ.135, రూ.187.50 చెల్లించాలన్నారు. ఈ బీమాకు కాల పరిమితి ఏమీ లేదని, ఎప్పుడైనా కట్టుకోవచ్చన్నారు.

474 మందికి వైద్యసేవలు



చినకొండేపూడిలో ఇంటి వద్ద వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడిలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 474 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇంటి వద్ద మంచపై ఉన్న రోగుల వద్దకు నేరుగా వెళ్లి వైద్యసేవలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎస్ఎం కృష్ణవేణి, ఆశావర్కర్లు ఆశాజ్యోతి, దేవి, లక్ష్మి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



అరుగుల ప్రసాద్

మధురపూడి: కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెం గ్రామానికి చెందిన అరుగుల ప్రసాద్ (24) రాజమహేంద్రవరం ప్రైవేటు హాస్పటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కోరుకొండ ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18వ తేదీన జంబూపట్నం క్రాస్‌రోడ్డు సమీపంలోని గుర్రాల బొమ్మ సైట్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా స్కూటీపై వస్తున్న యువతిని ప్రసాద్ ఢీకొట్టాడు. ఈ ఘటనలో గాయపడిన యువతిని హాస్పిటల్‌కు తరలిస్తుండగా మృతి చెందింది. అపస్మారక స్థితిలో ఉన్న ప్రసాద్ బంధువుల సహకారంతో ప్రైవేటు హాస్పటల్లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

జగనన్న విద్యా కానుకలొచ్చేశాయ్..

- పాఠశాలల ప్రారంభం రోజే పంపిణీకి చర్యలు
- నియోజకవర్గంలో 18,026 మంది అర్హులు

అనపర్తి: పేదల విద్యాభివృద్ధే లక్ష్యంగా.. ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యకు శ్రీకారం చుట్టారు. తద్వారా ప్రతి విద్యార్థి చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించే దిశగా కృషి చేస్తున్నారు. విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం మన బడి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చింది. కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని విధంగా సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. అదేవిధంగా పేదింటి బిడ్డల చదువులకు ఎటువంటి ఆటంకం లేకుండా జగనన్న విద్యాకానుక పథకం అమలు చేస్తుంది. గతంలో పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నాయంటే విద్యార్థుల తల్లిదండ్రులు విద్యా సామగ్రి కొనుగోలు చేసేందుకు ఆర్థిక ఇబ్బందులతో గాబరా పడేవారు. అయితే జగనన్న ప్రభుత్వంలో ఆ సమస్య తొలగిపోయింది. జగనన్న విద్యా కానుక పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు అవసరమైన నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు తదితర వస్తువులు ఉచితంగా అందజేస్తుంది. అనపర్తి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో పరిశీలిస్తే.. అనపర్తి మండలంలో 44 స్కూళ్లకు సంబంధించి 4,795 మంది విద్యార్థులకు, రంగంపేటలో 48కు సంబంధించి 4,653 మంది, బిక్కవోలులో 39కు సంబంధించి 4,267 మంది, పెదపూడిలో 60 స్కూళ్లకు చెందిన 4,311 మంది విద్యార్థులకు వీటిని అందించనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 18,026 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. విద్యా సంవత్సరం తొలిరోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



అనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్‌కు చేరిన పాఠ్య పుస్తకాలు

సమగ్ర పర్యవేక్షణ

2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరిపడా విద్యా కానుక సామగ్రి ఇప్పటికే అన్ని మండల విద్యా వనరుల కేంద్రాలకు చేరింది. స్టాక్ పాయింట్ నుంచి విద్యా సామగ్రిని పాఠశాలలకు పంపిణీ చేసేందుకు మండల విద్యాశాఖాధికారులు ప్రణాళికలు రూపొందించారు. దీనిలో భాగంగా పాఠశాల స్థాయిలో విద్యార్థుల సంఖ్యను బట్టి కిట్లు తయారు చేసే ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. పాఠశాలకు సరఫరా చేసేందుకు గాను కిట్లు తరగతుల వారీగా వేరు చేసే పనిలో సీఆర్పీలు నిమగ్నమయ్యారు. దీనిని ఆయా మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

సామగ్రి ఇచ్చేదిలా..

విద్యా కానుక కింద ప్రభుత్వం విద్యార్థులకు అందించే ప్రతి కిట్‌లో ఒక స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫాం, ఒక జత షూ, రెండు జతల సాక్స్, టై, బెల్ట్ తరగతుల వారీగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ ఉంటాయి. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు టెస్ట్ బుక్స్, ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు వర్క్ బుక్స్, ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేయనున్నారు. జగనన్న విద్యా కానుక పథకం కింద నాణ్యమైన వస్తువులను రాష్ట్ర ప్రభుత్వ అందిస్తుంది. ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు మొత్తం 8 నోట్ బుక్స్, 8వ తరగతి విద్యార్థులకు గ్రాఫ్ బుక్స్‌తో కలిపి 10, 9వ తరగతి విద్యార్థులకు 12, పదో తరగతి విద్యార్థులకు 14 నోట్ పుస్తకాలు అందజేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న విద్యాకానుక విద్యా సామగ్రిని విద్యార్థులకు కిట్ రూపంలో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు అందజేయనున్నారు.

పాఠశాలలకు కిట్లు



2023–24 విద్యా సంవత్సరంలో పాఠశాలల ప్రారంభం నాటికి ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే విద్యార్థులకు సరిపడా విద్యా కానుక కిట్లు స్టాక్ పాయింట్‌కు చేరాయి. జూన్ 10వ తేదీ నాటికే అన్ని పాఠశాలలకు విద్యా కానుక కిట్లు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– కె.స్వామినాయక్, ఎంఈఓ, అనపర్తి

ఇంటింటా సంక్షేమ కాంతులు



కాపవరంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- నాలుగేళ్లలో ప్రతి గడపకూ లబ్ధి
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు దరి చేరాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం కాపవరం గ్రామంలో మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో రాష్ట్ర భవిష్యత్ కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నారని చెప్పారు. అర్హులందరికీ న్యాయం చేసేందుకు వలంటీర్ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చారన్నారు. సర్పంచ్ సత్యం శెట్టి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ కర్రి గంగరాజు, ఎంపీటీసీ సభ్యుడు మార్నెళ్ల భీష్ముడు, ఉప సర్పంచ్ పోసిన గోపాలకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నిడదవోలు శ్రీను, పంచాయతీ వార్డు సభ్యుడు గొంగూలూరి సూరిబాబు, నాయకురాలు కొట్టు వరలక్ష్మి, మామిడాల హైమావతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 53 లక్షల పనిదినాలు కల్పించడమే లక్ష్యం



స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మునగ నర్సరీని పరిశీలిస్తున్న జీఎస్ రాంగోపాల్

గోకవరం: తూర్పుగోదావరి జిల్లాలో 53 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని మండల ప్రత్యేక అధికారి, డ్వామా, సంచాలకులు జి.ఎస్ రాంగోపాల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో పెంచుతున్న మునగ నర్సరీని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.29వేల అంచనాతో నర్సరీని చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 18 మండలాల్లో 73 వేల మందికి పనులు కల్పిస్తున్నారు. గోకవరం మండలంలో 7వేల మందికి ఉపాధి హామీలో వివిధ పనులు ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో జిల్లాలో 75 చెరువులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే 50 చెరువులను అభివృద్ధి పూర్తయ్యాయని, వర్షా కాలంలో కూడా ఉపాధి హామీ వేతనదారులకు పనులు కల్పిస్తామని తెలిపారు. రైతు పొలంలో కుంటలు తవ్వకం, కందకాలు, సరిహద్దు కందకాల, మిట్టి ముగ్రం రోడ్లు, మొక్కలు పెంపకం వంటి పనులు జరుగుతాయన్నారు. మునగ నర్సరీలో పెంచిన మొక్కలను డ్వాక్రా గ్రూపుల ద్వారా ప్రతి ఒక్కరికి రెండు మునగ మొక్కలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ, ఏపీఓ, టీఎలు ఉన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

మధురపూడి: కోరుకొండ మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీవర్షం కురిసింది. గాలుల ధాటికి పలుచెట్లు నేలకొరిగాయి. కోటికేశవరం పరిధిలోని మామిడి తోటల్లో కాయలు నేలరాలిపోయిు.

రాజానగరం: ఈదురు గాలులతో సోమవారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షంతో వాతావరణం చల్లబడింది. పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. డ్రైనేజీలు నిండిపోయి వర్షం నీరు రోడ్లపై పొంగిపొర్లింది. ఈదురు గాలుల ప్రభావంతో కలచవర్ల, నరేంద్రపురం, కానవరం, చక్రద్వారబంధం, వెలుగుబంద, దివాన్‌చెరువులో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి, విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

స్పందనకు తొమ్మిది అర్జీలు



రంగంపేట తహసీల్దార్ అమ్మాజీకి వినతిపత్రం అందిస్తున్న అర్జీదారుడు

రంగంపేట: మండలంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి తొమ్మిది అర్జీలు వచ్చాయని అమ్మాజీ తెలిపారు. కోటపాడు ఏడీబీ రోడ్డులో భూమిని ఓ వ్యక్తి ఆక్రమించారని ఎస్.వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించాలని, భూమిని సర్వే చేయాలని, ఆర్‌అండ్‌బీ నుంచి పరిహారం ఇప్పించాలని అర్జీలు అందాయని ఆమె వివరించారు.

సీతానగరంలో ఒక అర్జీ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఒక్క అర్జీ వచ్చిందని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు తెలిపారు. పురుషోత్తపట్నానికి చెందిన బండి సత్యప్రసాద్ అందించిన ఈ అర్జీని స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఆన్‌లైన్‌లో రిఫర్ చేశామన్నారు.

వ్యవసాయంపై అవగాహన



కడియం లైబ్రరీలో విద్యార్థులు

కడియం: చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆరుగాలం కష్టించి, సాగుచేసి మనకు ఆహారాన్ని సమకూరుస్తున్న రైతులను గౌరవించాలని సూచించారు. గ్రంథాలయ సభ్యులు ఉప్పులూరి చిట్టియ్య మాట్లాడుతూ సాగు విధానాలు, పంటలను వివరించారు. పేపరుమిల్లు ఉద్యోగి భాస్కరరావు మర్యాద రామన్న కథలు, రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వర్లు అక్బర్ బీర్బల్ కథలు, రిషిత పార్లమెంటు విశేషాలు, కె.ప్రసాద్ క్రాఫ్ట్‌లో మెళకువలను తెలిపారు.

ట్రాఫిక్ చిక్కుముడి వీడేనా..

- నగరంలో పెరిగిన వాహనాలు
- ఎక్కువైన ప్రజల రద్దీ
- ట్రాఫిక్ నియంత్రణకు అధికారుల చర్యలు



రాజమహేంద్రవరంలో వాహనాల రద్దీ

కంబాలచెరువు: నగరంలోని సమస్యల్లో కెల్లా ప్రధానమైంది ట్రాఫిక్. ఇరుకు రహదారులు, ఎత్తుపల్లాలతో కూడిన రోడ్ల కారణంగా నిత్యం ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. దీనికి తోడు ఫుట్‌బోర్డు ఆక్రమించిన చిరు వ్యాపారులు రహదారిపై ఏర్పాటు చేస్తున్న తోపుడు బండ్లు ఈ సమస్యను మరింత జఠిలం చేస్తున్నాయి. ఆ చిక్కుముడిని విప్పాలంటే అధికారులకు తలకు మించిన పనిగా మారుతోంది. ఎన్ని సంస్కరణలు తీసుకువచ్చినా తిరిగి యథాస్థితికి వస్తుండడంతో తలలు పట్టుకుంటున్నారు. దీంతో శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు అధికారులు నడుంబిగించారు.

పెరిగిన వాహనాలు

రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ గతంలో కన్నా మరింత పెరిగింది. దీనికి కారణం జిల్లా విభజన తర్వాత రాజమహేంద్రవరం జిల్లా కేంద్రం కావడం, ఇక్కడే కలెక్టర్ కార్యాలయం, ఇతర అధికారుల కార్యాలయాలు కావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పనుల మీద నగరానికి వచ్చే వారి తాకిడి ఎక్కువైంది. దీనికి తోడు ఉభయ గోదావరి జిల్లాలకు ప్రధాన వ్యాపార కేంద్రమైన నగరానికి నిత్యం వ్యాపార అవసరాల కోసం వేల మంది వచ్చి వెళుతుంటారు. రాజమహేంద్రవరం, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు నగరాన్ని నిత్యం ఏదో పనిమీద సందర్శిస్తుంటారు. కరోనా విపత్కర పరిస్థితుల తర్వాత కార్ల వినియోగం పెరిగింది. నిత్యం ఏదో ఒక మూల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు కొంత ఇబ్బంది కలుగుతోంది.

కూడళ్ల వద్ద కానిస్టేబుల్ ఉండేలా...

నగరంలో నిత్యం ట్రాఫిక్ రద్దీతో కొట్టుమిట్టాడే కొన్ని కూడళ్లను ఇప్పటికే పరిశీలించారు. ఆయా కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండటానికి గల కారణాలు, అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ అధికారులతో కలిసి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. గతంలో నగర శివారున ఉండే జాతీయ రహదారి ప్రస్తుతం మధ్యలోకి వచ్చింది. ముఖ్యంగా లాలాచెరువు, మోరంపూడి, బొమ్మూరు, వేమగిరి కూడళ్లలో ప్రమాదాలు పెరుగుతున్నాయి. అక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు చేపట్టారు. అలాగే రద్దీగా ఉన్న ప్రాంతాలు, కూడళ్లలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు నిత్యం ఉండేలా చర్యలు చేపట్టారు.

ఎన్‌సీబీసీ చైర్మన్‌ను కలిసిన పద్మలత

రాజమహేంద్రవరం సిటీ: కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.రెండు లక్షల కోట్లకు పెంచాలని, బీసీలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకం దేశమంతటా అమలు చేయాలని వినతిపత్రం అందజేసినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ పద్మలత అనుసూరి తెలిపారు. సోమవారం న్యూఢిల్లీలోని ఎన్‌సీబీసీ క్యాంపు కార్యాలయంలో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్, మాజీ కేంద్ర మంత్రి హన్సరాజ్ గంగారామ్ అహిర్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యతో కలిసి ఆమె వినతిపత్రం అందజేశారు.

రెజ్లర్ల అరెస్టును ఖండిస్తూ ర్యాలీ

ప్రకాశం నగర్: మహిళా రెజ్లర్లను వేధింపులకు గురిచేసిన డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలని, అక్రమంగా అరెస్ట్ చేసిన మహిళా రెజ్లర్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ఎస్ఎఫ్ఐ, యుటీఎఫ్, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బైపాస్ రోడ్డులో ర్యాలీ చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రాజా, యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీమణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజులోవ మాట్లాడుతూ రెజ్లర్లు తమకు న్యాయం చేయాలని, రక్షణ కల్పించాలని దాదాపు 40 రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు.

నేడు రిలే దీక్ష

రాజానగరం: సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ స్టేట్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నామని ఆ సంఘం రూరల్ అధ్యక్షుడు ఆకుల రామచంద్రరావు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రతి నెలా ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి తదితర డిమాండ్లతో ఈ దీక్ష చేయదలచామన్నారు. ఉద్యోగులంతా ఈ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాహనాల వేలం

రంగంపేట: మండలంలో సారా తరలింపులో స్వాధీనం చేసుకున్న పది వాహనాలను వేలం వేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జి.వెంకటలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రంగంపేట స్టేషన్ పరిధిలో 9 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోకు వచ్చే నెల 3న మధ్యాహ్నం 3 గంటలకు రంగంపేట పోలీస్ స్టేషన్ వద్ద వేలం వేస్తామన్నారు. పాల్గొనేవారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు ధరావత్తు సొమ్ము చెల్లించాలన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణాన్ని కాపాడడం మనందరి బాధ్యత అని ఫారెస్టు బీట్ ఆఫీసర్లు దూడ ఆశారేఖ, పాలేపు మధుమోహన్, అర్చన అన్నారు. సోమవారం స్థానిక వెంకటేశ్వరనగర్ పార్కులో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అక్కడ మొక్కలు నాటారు.